


**4**

## గత సంచికనుంచి కొనసాగింపు

**జరిగిన జగన్నాటకం**

**"బోస్" సవ్యలంకలో కళ్ళు తెరిచాడు. ఎడమచేతితో మంచినీళ్ళు ఇవ్వబోయిన నందుకి అది తప్పు అని చెప్పి భంగపడ్డాడు. గుళ్ళో కుడి చేత్తో ప్రసాదం తిన్నందుకు అతణ్ణి బంధించి మరణదండన విధించబోయారు. ఆచార్య వేదాంతం, ద్వీప, నందు తండ్రి కలిసి బోస్ ని కాపాడారు.**

"మిమ్మల్ని ఎక్కడో చూశాను" అన్నాడు బోసు.

"నా పేరు మోహన్ దాస్" చెప్పాడా పెద్దాయన. తెల్లటి ఖద్దరు పంచె, చేతిలో కర్ర..!!

"గాంధీ!!" బోస్ ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"అవును గాంధీనే... నీకు ఏదీ గుర్తులేకుండా పోయిందని అనుకున్నాను. నేను ఎలా గుర్తున్నాను?" అన్నాడు.

"ఏమో బాపూ, నాకు కూడా తెలియదు... నేను సముద్రపు ఒడ్డున వున్నప్పుడు కూడా మబ్బుల్లో మీరు, సుభాష్ చంద్ర బోస్ కనపడ్డారు. అదేం విచిత్రమో మీ ఇద్దరినీ మాత్రం గుర్తుపట్టగలిగాను... అంతకు మించి కనీసం నా పేరు కూడా నాకు గుర్తులేదు" ఆశ్చర్యంగా

చెప్పాడు బోస్. అసలు అతనికి ఇప్పుడు జరుగుతున్నది నిజమో, మాయో అర్థం కావటంలేదు. కానీ దాని గురించి ఆలోచించడానికి కూడా మనసు ఒప్పుకోవటంలేదు.

గాంధీజీ ఏం మాట్లాడలేదు. నెమ్మదిగా తలాడించి, నాలుగడుగులు ముందుకు వేసి అక్కడే వున్న ఒక కుర్చీలో కూర్చున్నాడు. సుభాష్ బోస్ గురించి చెప్పకుండా వుంటే బాగుండేదని అనిపించింది బోస్ కి.

"ఇంతకీ కుడి చెయ్యి వాడటం కరెక్ట్ అంటావా? ఎడమ చెయ్యి వాడటం కరెక్ట్ అంటావా?" అడిగాడు భుజం మీద శాలువాని సర్దుకుంటూ.

"అదేంటి బాపూ? అలా అడుగుతారు. ఇక్కడ వున్న వాళ్ళందరికీ పిచ్చి పట్టినట్లుంది. కుడి చేతిని ముఖ్యమైన పనులకు వాడితే మరణదండన విధిస్తున్నారు. కనీసం నాకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా...." అతను పూర్తి చెయ్యకముందే బాపూ మళ్ళీ ప్రశ్నించాడు.

"ఒకవేళ అవకాశం ఇచ్చి వుంటే ఏం చెప్పేవాడివి?" అడిగాడయన.

"ఇంకేం చెప్తాను? కుడి చెయ్యే వాడాలని చెప్తాను... దేవుడికి సంబంధించిన విషయాలలో, ముఖ్యమైన సందర్భాలలో కుడిచేతినే కదా వాడాలి?"

"నీకు ఈ విషయం కూడా గుర్తుందా? ఎలా నమ్మను? ఒకవేళ మిగిలిన విషయాల లాగే ఎడమ చేతిని వాడాలన్న సంగతి మర్చిపోయి కుడి చేతిని వాడాలనుకుంటున్నావేమో?" అడిగాడు గాంధి.

"లేదు బాపూజీ... నాకు ఖచ్చితంగా గుర్తుంది"

"నీ పేరు గుర్తులేదు. నీ ఊరు గుర్తులేదు. కానీ కుడి చెయ్యి వాడాలని గుర్తుంది. నేను గుర్తున్నాను, సుభాష్ గుర్తున్నాడు. చిత్రంగా లేదూ?"

బోస్ కి ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు. బాపూ చెప్పింది నిజమే. ఏ విషయం గుర్తులేని తనకు ఈ రెండు మూడు విషయాలే స్పష్టంగా తెలియటం ఏమిటి?

"అవును బాపూ, ఏ విషయం గుర్తులేని నాకు ఈ విషయాలే ఎందుకు గుర్తున్నాయి?" అడిగాడు.

"బహుశా ఆ ప్రశ్నకు సమాధానం తెలుసుకుంటే నువ్వు ఈ ద్వీపానికి ఎందుకు వచ్చావో తెలుస్తుందేమో" అన్నాడు బాపు. బోసు అదే విషయం ఆలోచిస్తు యధాలాపంగా బాపూ వైపు చూసి అవాక్కయ్యాడు. ఆయన తన ఎడమ చేతిని ముందుకు చాచి గ్లాసులో వున్న నీళ్ళని అందుకోని గటగటా తాగాడు.

"బాపూ మీది ఎడమ చేతి వాటమా?" అడిగాడు బోస్.

ఒక్కసారి ముఖం మీద నీళ్ళు పడ్డట్లు ఎదురుగా వున్న దృశ్యం అస్పష్టంగా మారిపోయింది. ఎదురుగా వున్న గాంధిజీ క్రమంగా కరిగి నేల మీదకి జారిపోతున్నట్లు అనిపించసాగింది. అలా కరిగిపోతున్న గాంధీ ముఖం మీద చిరునవ్వు మాత్రం చెక్కు చెదరలేదు.

★★★

బోస్ కళ్ళు తెరిచాడు. ఎదురుగా నలుగురు మనుషులు కనిపించారు. ఆచార్య వేదాంతం, ద్వీప, నందు, నందు తండ్రి పశుపాల. నందు చిన్నవాడు. వేదాంతం ఎత్తు నాలుగడుగులే. ఈ ఇద్దరూ ఒకే ఎత్తులో కనిపించారు. ద్వీప పశుపాల కన్నా ఎత్తుగా వుంది.

"గాంధీజీ ఎక్కడ?" అన్నాడు బోస్ లేస్తూనే.

"గాంధీజీ ఎవరు?" అన్నది ద్వీప సమాధానంగా.

"మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ... బాపూజీ. ఆయన తెలియకపోవటం ఏమిటి?" అన్నాడు బోస్ ఆశ్చర్యంగా ఆ అమ్మాయి వైపు చూస్తూ. ఆ తరువాత అర్థం అయ్యింది అప్పటిదాకా గాంధీజితో మాట్లాడినదంతా తన కల అని. వెంటనే తల దించుకున్నాడు. ఆచార్య వేదాంతం ముందుకు వచ్చాడు.

"చూడండి, మీ గురించి తెలుసుకున్నాను. మీది ఈ ప్రాంతం కాదని, ఇక్కడి సంగతులు తెలియక అనవసరంగా ఇబ్బంది పడ్డారని కూడా తెలిసింది. ఇప్పుడు మీరు ఏదో గాంధీ అన్న పేరు ప్రస్తావించారు. అలాంటి పేరు పెట్టుకునే మనుషులు ఇక్కడికి ఉత్తరంగా వుండే సింధూర దేశంలో వుంటారు. ఒకవేళ మీరు కూడా అదే ప్రాంతానికి చెందినవాళ్ళు అయ్యుంటారేమో" అన్నాడు. చీకట్లో ఒక్కసారిగా వెలుగు నిండినట్లు అనిపించింది బోసుకి.

"అయితే నేను వెంటనే సిందూర దేశం వెళ్ళాలి" అన్నాడు.

"అది అంత సులభం కాదు... అక్కడికి వెళ్ళాలంటే మహాసాగరం దాటాలి. అసలు ఈ ద్వీపాన్ని దాటి వెళ్ళాలంటేనే మహాధినేత అనుమతి కావాలి. అది దాదాపు అసాధ్యం." చెప్పాడు వేదాంతం.

"ఎందుకు? నేను ఎక్కడ్నుంచో ఇక్కడికి వచ్చి పడ్డాను. మళ్ళీ తిరిగి వెళ్ళిపోవాలనుకుంటున్నాను. ఇందులో వేరే ఎవరో అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఏముంది?"

"అడగటానికి చాలా మామూలు విషయంలా అనిపించచ్చు కానీ, సమాధానం వెనుక కొన్ని వందల సంవత్సరాల చరిత్ర వుంది. అవన్నీ ఇప్పుడు చెప్పలేను కానీ నువ్వు అనుకుంటున్నట్లు ఈ ద్వీపాన్ని దాటి వెళ్ళటం దాదాపు అసాధ్యం అని గుర్తుపెట్టుకో" చెప్పాడు వేదాంతం. ఆ తరువాత వెనక్కి తిరిగి పశుపాలుడి వైపు చూశాడు. "అతనికి భోజనం పెట్టే ఏర్పాట్లు చేయండి" అన్నాడు.

మరో పది నిముషాలలో బోస్ తేరుకున్నాడు. నందు ఇచ్చిన చల్లటి నీటితో ముఖం కడుక్కోని, ద్వీప ఇచ్చిన పొడి గుడ్డతో తుడుచుకున్నాడు. ప్రాణం లేచి వచ్చినట్లు అనిపించింది. ఆ పాటికే భోజన ఏర్పాట్లు కూడా అయ్యాయి. బోస్, ఆచార్య వేదాంతం, పశుపాల,నందు కూర్చున్నారు. ద్వీప అందరికీ అరటి ఆకులు వేసి, బోస్ ముందు పళ్ళెం పెట్టి అన్నం వడ్డించింది. వెంటనే అన్నం పైన పెరుగు వేసింది. బోస్ ఆశ్చర్యపోయాడు. చుట్టూ ఏవో కూరలు, పప్పు లాంటివి వున్నాయి. వాటన్నింటిని కాదని పెరుగు ముందు వెయ్యడమేమిటో అర్థం కాలేదు.

"అదేంటి ముందు పచ్చడో, కూరో వేస్తారు. మీరు పెరుగు వేశారేమిటి?" అడిగాడు. ద్వీప మరింత ఆశ్చర్యంగా చూసింది.

"మీ దేశంలో ముందు పెరుగు వేసుకోరా?" అంది

"వేసుకుంటాం. కానీ మొదట్లోకాదు, చివర్లో వేసుకుంటాం" చెప్పాడు. ద్వీప నందు వైపు చూసింది.

"నందూ, మనం భోజనం పెరుగుతో ఎందుకు మొదలుపెట్టాలో చెప్పు?" అని అడిగింది.

"భోజనం చెయ్యడానికి ముందు మన కడుపులో కొన్ని రకాల ఆమ్లాలు తయారౌతాయి. ఆ ఆమ్లాలను చల్లార్చడానికే ముందు పెరుగు తినాలి. మొదటే పచ్చళ్ళు, కూరలు తింటే అవీ, ఆ ఆమ్లాలలు మరింత తీవ్రతరం చేసి పేగులకు నష్టం కలిగిస్తాయి." చెప్పాడు నందు.

"ఇది మా ఇళ్ళల్లో ప్రతి చిన్నపిల్లాడికి చెప్పే సంగతి." అంటూ నవ్వింది ద్వీప.

బోస్ కాస్త తటపటాయించాడు. అన్నంలో మొదట పచ్చడి కలుపుకోవటం ఒక అలవాటులా గుర్తుకొస్తోంది. వీళ్ళు పెరుగు వేశారు. మొదట పెరుగు తినడానికి వాళ్ళు చెప్పే కారణం కూడా సమంజసంగానే అనిపించింది.

"మీకు ఇబ్బందిగా వుంటే అది పక్కన పెట్టి మీకు నచ్చినట్లే తినండి" చెప్పింది ద్వీప.

"ఫర్లేదులెండి... మీ పద్ధతిలోనే తింటాను" అన్నాడు బోస్. ఆ తరువాత ముందు పెరుగన్నం, తరువాత పప్పు, ఆ తరువాత కూరలు, చివర్లో పచ్చడి వేసుకోని భోజనం ముగించాడు. అందరూ అలాగే తిన్నారు.

"నేను మీరు చెప్పిన సింధూర దేశం వెళ్ళడానికి మార్గమే లేదా?" అన్నాడు భోజనాలు అయిపోయి అంతా ఒక చోట కూర్చున్నప్పుడు.

"చెప్పానుగా, ఈ ద్వీపాన్ని వదలాలన్నా మీకు అనుమతి అవసరం అవుతుంది. గత ఐదు సంవత్సరాలలో ముగ్గురికి మాత్రమే ఈ ద్వీపాన్ని వదిలేందుకు అనుమతి లభించింది. అందులో ఒకరిది వైద్య అవసరం, ఒకరు సాహిత్యకారుడు, ఇంకొకణ్ణి నేనే, చరిత్రకారుణ్ణి." చెప్పాడు వేదాంతం. ఆయన్ను చూస్తే అన్ని తెలివితేటాలు ఉన్న వ్యక్తిలా కనిపించడు.

"అనుమతులు ఏవీ లేకుండా మూడో కంటికి తెలియకుండా ఈ ద్వీపాన్ని దాటించే వాడు ఒకడున్నాడు బాబూ..." అప్పటిదాకా మాట్లాడకుండా వున్న పశుపాల అన్నాడు.

"ఎవరు? చెప్పండి?" బోసు ఆవేశం ఆనందం కలగలిపి అరిచాడు.

"అతని పేరు జలపతి..." అన్నాడు పశుపాల. ఒక్కసారి ఆ గదిలో ఏదో విస్ఫోటనం జరిగినట్లు వేదాంతం, ద్వీప, నందు అదిరిపడ్డారు. ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"జలపతా? దేశాధినేతనే ఎదిరించినందుకు సంఘ బహిష్కారం విధించారు? అతనేనా?" అడిగింది ద్వీప.

"అతనే" క్లుప్తంగా చెప్పాడు పశుపాల.

"అతన్ని కలిసినా, మాట్లాడినా, అతనికి ఎలాంటి సహాయం చేసినా మరణదండన విధించారు కదా?" వేదాంతం అడిగాడు.

"అందుకే, ఈ ద్వీపంతో సంబంధం వద్దనుకునే వాళ్ళు, ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్ళాలనుకున్న వాళ్ళు అతన్ని కలుస్తారు. అతను మహాసముద్రం దాటించి వేరే దేశానికి చేరవేస్తాడు. ఇంక అతనిని కలిసినందుకు శిక్ష వెయ్యాలన్నా ఆ అవకాశం వుండదు" చెప్పాడు పశుపాల.

"ఏమైనా సరే, ఈయన జీవితాన్ని మళ్ళీ చిక్కుల్లో పెట్టడం అంత మంచిది కాదు. ధర్మనారీ సమితి అధికారాన్ని ఒకసారి వాడేశాం కాబట్టి ఇక మళ్ళీ అది పని చెయ్యదు. అప్పుడు ఆయన్ను కాపాడటం అసాధ్యమౌతుంది" చెప్పింది. బోస్ కి ఏమీ అర్థం కాలేదు.

ధర్మనారీ సమితి ఏమిటి? కాపాడటం ఏమిటి? అవును నిజమే... మరణదండన విధించి దాదాపు తల నరకబోతూ ఎందుకు వదిలేశారు? అప్పటిదాకా స్ఫురణకి కూడా రాని ప్రశ్నలు అతని మెదడులో విచ్చుకున్నాయి.

"ధర్మనారీ సమితి అంటే ఏమిటి?" అడిగాడు.

"మీకు మరణదండన విధించారు కదా, అది జరగకుండా ఆపింది ధర్మనారీ సమితే" అన్నడు వేదాంతం.

"అదే ఏమిటా సమితి? ఆ సమితిలో ఎవరుంటారు?" బోసు మాటల్లో తెలుసుకోవాలన్న ఆతృత స్పష్టంగా వినపడుతోంది.

"అయితే మీకు చాలా చెప్పాలి. నువ్వు చెప్పమ్మా" అన్నాడు వేదాంతం. ద్వీప చెప్పసాగింది –

"మిమ్మల్ని బంధించిన వ్యక్తిని దళాధిపతి అంటారు. అతనికి కొన్ని అధికారాలు ఇవ్వబడ్డాయి. కొన్ని రకాల నేరాలకు ఎవరినీ సంప్రదించకుండానే శిక్ష అమలు పరిచే అధికారం అతనికి వుంది. మీకు మరణదండన అలాగే విధించాడు. అతని నిర్ణయాన్ని మార్చాలన్నా, ఆపాలన్నా అందుకు మహాధినేతకు మాత్రమే అధికారం వుంటుంది. ఆ మహాధినేత నిర్ణయాన్ని కూడా ఎదిరించే అధికారం కేవలం ఒకరికి మాత్రమే ఇవ్వబడింది. అదే దర్మనారీ సమితి. ఇరవై ఏళ్ళు దాటగానే ప్రతి అమ్మాయి ధర్మనారీ సమితిలో భాగం అవుతుంది. నేర చరిత్ర వున్నవాళ్ళు, సరైన నడవడి లేనివారు తప్పించి మిగిలిన వాళ్ళంతా ఇందులో సభ్యులుగా వుంటారు. అలాంటి సభ్యులు పదిమంది కలిసి

అందరూ ఏకగ్రీవంగా అలాంటి నిర్ణయం తీసుకోవచ్చు. ఆ నిర్ణయం ఏదైనా మహాధినేత కూడా అంగీకరించాల్సిందే. అయితే ఒకసారి ఇలాంటి నిర్ణయంలో భాగం పంచుకున్న స్త్రీకి మళ్ళీ అలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం వుండదు."

"అయితే నన్ను కాపాడటానికి మీరు ఆ అధికారాన్ని వాడారా?" అడిగాడు బోసు ఆశ్చర్యంగా.

"నేను ఒక్కదాన్నే కాదు, నందు వాళ్ళ అమ్మ, ఆచార్య వేదాంతం గారి శిష్యులు, నా స్నేహితుల... చెప్పానుగా పదిమంది కావాలని"

బోసు అప్రయత్నంగా చేతులు జోడించాడు.

"అయితే జలపతి దగ్గరకి వద్దంటారా?" పశుపాల అడిగాడు.

"వెంటనే వెళ్ళాలి. మీరు తీసుకెళ్ళగలరా?" అన్నాడు బోస్.

"అక్కడిదాకా తీసుకెళ్తాను. జలపతి దగ్గరకు రావడం మాత్రం కుదరదు"

"ఫర్లేదు. మీరు ఆ మాత్రం సహాయం చేస్తే చాలు" అన్నాడు.

ఆచార్య వేదాంతం ఇక తను వచ్చిన పని అయిపోయిందన్నట్లు లేచి, ద్వీప వైపు చూసి వెళ్దాం అన్నట్లు సైగ చేశాడు. తను జలపతి దగ్గరకు వెళ్ళడం ఇష్టం లేకే వాళ్ళిద్దరూ వెళ్ళిపోతున్నారని అర్థం చేసుకున్నాడు బోస్.

"మీకు కోపం వచ్చిందేమో తెలియదు. మీరు నా ప్రాణాలను కాపాడారు. అందుకు నేను ఎప్పటికీ ఋణపడి వుంటాను. కానీ నేను ఇక్కడ వుండలేను. నేను కుడి చేతి వాటం వాడిని. ఈ ద్వీపంలో వున్న ప్రతి మనిషి ఎడమ చేతిని వాడుతున్నాడు. పోనీ నా మానాన నన్ను వదిలేసినా ఫర్లేదు. కుడి చేతిని వాడితే మరణదండన, శిక్షలు అంటున్నారు. ఇలాంటి చోట ఎలా వుండగలను చెప్పండి?" అన్నాడు బోస్.

"ఇక్కడ వుండాలనుకుంటే చాలా సులువైన మార్గం వుంది. కుడి చేతికి బదులు ఎడమ చేతిని వాడు. సుఖంగా సంతోషంగా మాలో ఒకడిగా ఉండిపోవచ్చు" అన్నాడు వేదాంతం.

"అదెలా కుదురుతుంది? నేను అలా మారలేను. దేవుడి దగ్గర, పవిత్రమైన కార్యాలలో, గౌరవాన్ని చూపించాల్సిన సమయంలో ఇంకా అనేక సందర్భాలలో కుడి చేతినే వాడాలి. అలా వాడటం అలవాటైపోయింది. ఒక్క అలవాటే కాదు అది నా నరనరాల్లో వుంది. అలాంటప్పుడు నేను మారలేను, ఎవరైనా ఎడమ చేతిని వాడటాన్ని కూడా నేను సమర్థించలేను"

"అదే ఎందుకు?"

"ఎందుకంటే నాకు తెలిసిన పద్ధతి, నేను అవలంబించిన పద్ధతి ఒకటుంది. దానికి భిన్నంగా ప్రవర్తించలేను"

"మరి ఇందాక భోజనం చేసినప్పుడు చివర్లో పెరుగు వేసుకునే నీ అలవాటుకు భిన్నంగా మొదట పెరుగే వేసుకోని తిన్నావు కదా? అప్పుడు నీకు ఇలాంటి ఆలోచన రాలేదా?"

ఆ ప్రశ్నకు ఏ సమాధానం చెప్పాలో అర్థం కాలేదు బోసుకి. తనకి అలవాటైన ఒక పద్ధతికి భిన్నంగా ప్రవర్తించాల్సి వస్తే ఒకసారి సర్దుకుపోయాడు, మరోసారి వ్యతిరేకిస్తున్నాడు. ఇదంతా ఆలోచించి చేసింది కాదు. అయినా ఎందుకిలా జరిగింది? సమాధానం చెప్పలేకపోతున్న బోసుని చూసి నవ్వాడు ఆచార్య వేదాంతం. ఆ తరువాత వెనక్కి తిరిగి ఆ ఇంట్లో నుంచి బయటకు నడిచాడు. ద్వీప కూడా ఆయన వెంటే నడుస్తూ వెనక్కి తిరిగి బోసుని చూసి వేడ్కోలుగా నవ్వింది.

ఆచార్య వేదాంతం వెనక్కి తిరగకుండానే గట్టిగా అన్నాడు –

"నేను అడిగిన ప్రశ్నకు సమాధానం తెలుసుకుంటే నువ్వు ఈ ద్వీపంలో ఎందుకు వుండాలో తెలుస్తుందేమో. ఆలోచించు"

ఇదే మాట ఇంకెవరో అన్నారు. అవును గాంధీజి.

గుర్తుకురాగానే గాంధీ అడిగిన ప్రశ్న అతని మనసులో మళ్ళీ వినపడింది.

"ఆ ప్రశ్నకు సమాధానం తెలుసుకుంటే నువ్వు ఈ ద్వీపానికి ఎందుకు వచ్చావో తెలుస్తుందేమో"

★★★

**(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)**

COMMENTS